

# ధర్మ పన్నాల వెనక

ప్రొద్దుట ఎనిమిది గంటలకే ఫిర్కా సప్లయి ఆఫీసరుగారు బంట్రోతు వెంకటస్వామితో చింతకాయలపాలెం చేరుకొన్నారు. పల్లే, పట్నం గాకుండా ఉండే, ఆ పాలేనికి ఆఫీసరుగారు రావటంతోటే... యీ వార్త పది నిముషాల కాలంలో పల్లెంతా పాకుకొని పోయింది.

పల్లెటూరివాళ్ళకి ఆఫీసరు రావటం హడలు. ఈయన వచ్చిన వార్త చెవినిపడిందో లేదో, మునసబు కరణాల మినహాగా గ్రామమంతా వారి దర్శనంచేసుకొని నమస్కారం చేసి, తిరిగి తమతమ పనుల్లోకి వెళ్ళిపోయారు. ఇన్‌స్పెక్టరుగారు అందరకూ తిరిగి నమస్కరిస్తూ, "ఆ... మళ్ళీ మధ్యాహ్నం పదకొండు గంటలకు అంతా ఒకసారి కన్పించండి" అన్నారు.

"చిత్తం"—అంటూ వెళ్ళిపోయారు తమ తమ పనులమీద గ్రామస్థులంతా...

మరి మిగిలింది అప్పుడే వచ్చిన మునసబు, కరణాలు. ఇరువురూ ఒకళ్ళకు మించిన ఘనులు ఒకరు. ఒకరి దగ్గరనుంచి పుచ్చుకోనటంలో యిద్దరూ అఖండులే. తాము యితరులకు పెట్టటం అంటే మాత్రం ప్రాణం పోయినట్లే.

ఆఫీసరుగారు రావటం వారిరువురకూ, కూడా లేనిగొడవ తెచ్చి పెట్టింది.

స్తోత్రపాఠకుల్లాగ, తాము చేయవలసిన పని మరచిపోయినట్లు నటిస్తూ "ఒహో... పాపం, చాలా తెల్లవారకట్ల బయలు దేరినట్లున్నారు. దారిగూడా మంచిది కాదు... కాఫీగీఫీ త్రాగటం పూర్తయిందాండీ?" అని ప్రశ్నించారు.

"ఎక్కడ...? నాలుగ్గంటలకు సరిగ్గా బయలుదేరాను. ఈ ఊరి ముందు గ్రామంలో వెంకటస్వామి యెక్కడో రెండు పుల్లలు సంపాదించుకొని రావటంవల్ల యిరువురు పండ్లు కడుక్కొన్నాం. ఎక్కడయినా టిఫిన్ తీసుకొందామంటే హోటల్సు అంతమంచివిగూడా కావు... ఏమోయ్ వెంకటస్వామీ" అన్నారు.

"ఆ... అవునండి. ఆ యెధవ హోటల్లో అయ్యగారు యెల్లా కక్కుర్తిపడ్తారండి. అందుకనే తీసుకోకుండా వచ్చేశారు" అన్నాడు వెంకటస్వామి.

మునసబు కరణాలు ఒకరివైపు ఒకరు చూచుకొన్నారు. ఇక ఖర్మం తప్పదు కాబోలు అనుకొని యేమిటో యోచిస్తూ నిల్చున్నారు.

ఆఫీసరుగారు, మరి ఓర్చుకొనలేక పోయారు "అబ్బ తలనొప్పి"—అన్నారు.

"వెంకటస్వామిఅందుకొన్నాడు: "అవును. అయ్యగారు తెల్లవారి లేచీ లేవటంతోటే,

ఓగేటి శివరామకృష్ణ

కాఫీ తాగాలి. కాఫీ తాగకపోతే తల నొప్పి వచ్చేస్తుంది'' అని.

మరి ఊరుకొంటే బాగుండదనే ఉద్దేశంతో ''అవును పాపం... అలవాటయిన వాళ్ళకు ఆ లాగే ఉంటుంది. నిముషంలో తెప్పిస్తాం. కాస్త ఓపికపట్టండి'' అని చెప్పి యిరువురూ యోచన చేసుకొంటూ బయటపడ్డారు.

''మన నెత్తిమీద యీ దరిద్రుడు యెక్కడ దాపరించాడా... నాలు గయిదుగంటలదాకా వాడికి సాయుధసేవ చెయ్యాలి''అని ఒకళ్ళలో ఒకళ్లు అనుకొన్నారు. మరి తెచ్చిపెట్టుకొన్న తద్దినం తప్పదు అనుకొని అక్కడున్న వెంకమ్మా విలాస్ కాఫీ క్లబ్‌కుపోయి... అరడజను యిడ్డెన్లూ, నాలుగు పెసరెట్లూ, అప్పుడే తయారుచేసిన వేడివేడి ఉప్మాకూడా తీసుకొని, అర్ధసేరు కాఫీ, సీసాలో పోయించుకొని ఆఫీసరుగారి ముందుకు వచ్చారు.

''అబ్బ... ఇంత ఆలస్యంచేశా రేమిటండీ?'' అనిహడావిడిచేశాడుబంట్రోతు వెంకటస్వామి.

''అబ్బ వాళ్ళేం చేస్తారోయ్... అక్కడ తయారవవద్దూ'' అన్నారు ఆఫీసరుగారు.

''ఆ... అవును. దొరగారు నిజానిజాలు తెలుసుకొంటారు. స్పెషలుగా తయారు చేయిస్తూంటే యింతసేపుపట్టిందండీ'' అన్నారు కరణం, మునసబులూ.

''అలాగా అండీ''—అన్నాడు వెంకటస్వామి మంచి చేసుకొందామని ప్రయత్నం ప్రారంభించుతూ.

ఆఫీసరుగారి ముందున్న బల్లమీద పొట్లాలు విడదీసి పెట్టూంటే ఏమిటో బలవంతంపెట్టటం మూలకంగా తింటూన్నట్లు నటిస్తూ... అరడజను యిడ్డెన్లూ, నాలుగు పెసరట్లూ, పావులా ఉప్మా, అర్ధసేరు కాఫీ నిముషాలమీద పూర్తిచేశారు. కరణం మునసబులు ఒకరివైపు ఒకరు చూసుకొని తెల్లమొఖాలు వేశారు. ''నాసంగతేం తేల్చారు?'' అన్నట్టుగా వెంకటస్వామి మునసబు కరణాలవైపు చూశాడు గుటకలువేస్తూ.

కానయితే... ఒకళ్ళవయిపొకరు తెల్లబోయి చూసుకొంటున్న వాళ్లు వెంకటస్వామిని, గమనించనే లేదు.

''సరే. బాగానే ఉంది... ఐతే ఇడ్డెన్లలో బియ్యప్పిండి బాగా కలసినట్లు కన్పిస్తూందే?''

''చిత్తం. బాగుండలేదాండీ?''—కరణంగారనంతోటే.

''ఉడకలేదాండీ''అని మునసబుగారు ఒకే మారన్నారు.

''ఆ... ఉడికాయ్. బాగానే ఉన్నాయ్. దానికికాదు. అసలు ఇడ్డెన్లు వగైరాలలో బియ్యం పిండి హెచ్చుగా ఉపయోగించకూడదు. అసలు యిడ్లీ యీ కారణంగా చేయకూడదనికూడా మాకు ప్రొసీడింగ్సు ఉన్నాయ్. అనవసరంగా యీ విధంగా బియ్యం ఖర్చయిపోతూంటే మరి ప్రజకు బియ్యం యెలా దొరుకుతాయండీ? ఏదో వాళ్ళకు తగిన సహాయంచేస్తూ, మేం చూసీ చూడకుండా కాలక్షేపం చేసేస్తూంటే వాళ్లు మరీ మితి మీరిపోతున్నారు. ఈ దినం ప్రత్యేకంగా యీ విధంగా తయారు చేశాడా? ప్రతిదినం యీ విధంగానే బియ్యం పాడుచేస్తాడా? ఈ విషయం ఎన్‌క్వయరీ చెయ్యాలి. ఇంతకాలం మీరేం చేస్తున్నట్లు?

కరణం యేదో జవాబు ఖంగారు పడుతూ చెప్పబోయాడు. కానయితే మునసబు సౌంజ్ఞ చేయటంతోటే ఆగిపోయాడు. మునసబు యీ విధంగా అన్నాడు: ''కాదండీ అయ్యా, ఎప్పుడూ యీ విధంగా తయారుచేస్తూంటే మేం ఊరుకొంటామా? ఈవాళ మినుములు అయిపోయినాయట, ఆ మూలకంగా బియ్యపు పిండి హెచ్చువేయవలసి వచ్చిందిట. ఇందాకా చెప్పాడండి'' అని. ''ఆ... అలా చెప్పండి. మనలో మనమాట. అనవసరంగా బియ్యం ఉపయోగంచేస్తూంటే, మరి బీద ప్రజ సంగతి కాస్త యోచించండి. అప్పుడే తొమ్మిదైంది అనవసరంగా కాలం పాడుచేయటం నా కిష్టం లేదు. ఈమారు మేంవేసుకున్న లెక్కల ప్రకారం మీగ్రామంనుంచి ఆరువందల బస్తాలు మాకివ్వాలి. మీరు మారు చెప్పడానికి వీల్లేదు. ఆహారసమస్య పరిష్కరించటానికి మన నాయకులెన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఆప్రయత్నాలన్నీ సఫలం కావాలంటే మీరంతా మాకు తగిన ప్రోత్సాహం యివ్వనట్లయితే మేం యేమీ చెయ్యలేం. మధ్యాహ్నానికి యింటికి

చేరుకోవాలి. వెంటనే మీ పెద్దవాళ్లందరికీ కబురుచెయ్యండి.''

''అయ్యా మీరలా అంటే యెల్లాగ. రెట్టింపుకు రెట్టింపు మీరు తెచ్చియిమ్మంటే ఎల్లాగ? మూడువందల బస్తా క్రిందటిమారు పుట్టించే టప్పటికి దేముడు దిగివచ్చాడు. ఆలాటిది మీరిప్పుడు కోరిన ఆరువందలు యేలా పుట్టించ కల్గుతామండీ'' అన్నాడు మునసబుగారు.

కరణంగారన్నాడు: ''వానలు వల్ల పొలాలు మునిగిపోయాయి. సగానికి సగంపయి కూడా లేదు. ఆలాటప్పుడు మీరు ఆరువందల బస్తా తీసుకొని రమ్మంటే యెట్లా తేగలమండీ. మీరే కాస్త యోచించండి'' అని.

''మీరెన్ని చెప్పినా కుదరదు. ముందు మీ ఊరి షాహుకార్లనూ పెద్ద రైతుల్నీ పిలిపించండి. మీకేంతెలుస్తుంది. పట్నాల్లో తిండి లేక ప్రజలెలాగ అవస్థల పాలవుతున్నారో. పల్లెటూళ్ళోన్నఉన్న మీకేవిధంగానయినా జరుగుతుంది. మాకు పైవాళ్లు చెప్పిన ప్రకారంగా నడుచుకోటం మా విధి. వెంటనే వాళ్లను రప్పించండి. మళ్లా తిప్పరాయికి సాయంకాలం వెళ్ళాలి'' అని.

''చిత్తం. ప్రయత్నంచేసినా దొరకటం కష్టమేమోనండి'' అన్నారు కరణం, మునసబులు యేకకంఠంతో.

''తర్వాత సంగతి నేచూస్తా. ముందు వాళ్లను పిలవండయ్యా'' అన్నారు ఆఫీసరు కోపంతో.

''చిత్తం''- అంటూ యిరువురూ నిష్క్రమించారు. వెంకటస్వామి కడుపు మాడుతోంటే, తెల్లబోయి చూస్తూ నిల్చున్నాడు. ఆఫీసరు అది గమనించి ''నీకేం పెట్టించలేదేమిటోయ్. అయితే వాళ్ల వెంట వెళ్లు'' అన్నారు ఆఫీసరుగారు. ''చిత్తం'' అంటూ వెంకటస్వామి నిష్క్రమించి వాళ్లను కలుసుకొన్నాడు.

అధికారి ఏమిటో ఆలోచిస్తూ, కూర్చున్నారు. మరోగంటకల్లా గ్రామాల్లో పెద్దలూ, వర్తకశ్రేష్ఠులూ వచ్చి నమస్కరించి కూర్చున్నారు.

''చాలా అత్యవసరమైన పనిమీద వచ్చాను. మీ గ్రామం నుంచి యీమారు ఆరువందల చిల్లర బస్తా వసూలుచేయాల్సి ఉంది. మీమీద అధికార్లకు కన్నెర్రగా ఉంది. మీరేమయినా అడ్డుచెప్పారంటే, మరికొన్ని గంటల్లో, పోలీసులతో సహితంగా యిళ్లను గాలించటం కూడా జరుగుతుంది'' అన్నారు ఆఫీసరు. ఈ మాటలు రావటంతోటే,కొంతమంది మేకపోతు గాంభీర్యం చూపిస్తున్నా,దడవటం మానలేదు. ఇది కనిపెట్టిన ''ఆఫీసరు ఏమంటారు? మీలో మీరు సఖ్యతపడి ఆరువందలూ యిస్తారా? లేనట్లయితే, మరి పని కానియ్యమంటారా?'' అన్నాడు ఆఫీసరుగారు.

''ఆ. యెందుకండి. ఏలాగోలాగ సర్దుకోనక పోతే ఎలాగండీ. మాకు లేనప్పుడు చూసుకొంటాం. కానివ్వండి'' అంటూ ఒక శ్రేష్ఠిగారనటంతోనే ''సరే అలాగే కానివ్వండి''అన్నారంతా.

''సరే. మీపేరు చెప్పండి. ఎనిబస్తాలు... ఎన్ని బస్తాలు. అంటూ కాగితంమీద అంకె— ఎదురుగా పేరు, వ్రాయటం ఆరంభించారు ఆఫీసరుగారు. మొత్తం ఎనిమిదివందల బస్తాలు పోగడ్డాయి.

''చాలు!'' ఆఫీసరుగారనసాగారు: ''ఏమయినా మీ పాలెంవారు మాయందు భక్తి విశ్వాసాలు కలవారు. అందుకనే మీరంటే, ప్రభుత్వంవారికి గూడా మంచి అభిప్రాయం యేర్పడింది. సరే మీకు కష్టం కల్గించినందుకు అన్యధా భావించరు కదూ. స్టాక్సు తీసుకెళ్లే కాలం తర్వాత మీకు చెబుతాను. ఇంతకీ మన దేశంలో పండే పంట మనకు సరిపోతోంది. పైవాళ్లకు యెగుమతి చేయటంకోసం మనం యిన్ని తిప్పలు పడవలసి వస్తూంది. సరే వెళ్లిరండి''.

వచ్చిన వాళ్లంతా వెళ్లిపోయారు. కరణం, మునసబూ చేతులుకట్టుకొని ''చిత్తం చిత్తం. మీరలా అనటంతోటే చూశారూ. ఎనిమిదివందల బస్తాలు వచ్చిపడ్డాయి. మేం బ్రతిమాలినా ఒక్క బస్తా లేదంటారండీ''అన్నారు.

''అవును. అందుకనే ఎంతమంది ఫిర్యాదుసప్లయి ఆఫీసర్లనిదించేసినా, నేమాత్రం ఖాయం అయిపోయాను. సరేగాని మీరో చిన్న సహాయం చేసిపెట్టాలి'' అన్నారు ఆఫీసరుగారు.